# మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది కేసీఆరే




యైటింక్లయిన్‌కాలనీ: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి విజయారెడ్డి, కోల్‌సిటీ: 28వ డివిజన్‌లో మ్యానిఫెస్టో అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పులేందర్

- బీర్ఎస్‌కు అండగా ఉండాలి
- కోరుకంటిని ఎమ్మెల్యేగా గెలిపించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి విజయారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 19 : తెలంగాణలో మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది సీఎం కేసీఆరేనని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ ప్రభుత్వం కూడా మహిళా సంక్షేమాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎంతో మహిళలు బతుకు భారమై జీవచ్ఛవంలా బతికిరాని ఆవేదన చెందారు. స్వరాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే కడుపులో ఉన్న బిడ్డ నుంచి వృద్ధుల వరకు ఎలాంటి కష్టం లేకుండా అండగా ఉన్నారని గుర్తు చేశారు. అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం, కేసీఆర్ కిట్టుతోపాటు రూ.13వేల ఆర్థిక సహాయం అందించి అక్కున చేర్చుకున్నారని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా, దివ్యాంగుల పింఛన్ ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని కాపాడన్నారు. సౌభాగ్యలక్ష్మి పేరుతో ప్రతి ఇంటి ఆడపడుచుకు రూ.3వేలు, రూ.400కే సిలిండర్ అందించేలా మ్యానిఫెస్టోలో పొందుపరిచి ఆడబిడ్డల కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరి కష్టనష్టాల్లో భాగం పంచుకుంటూ అండగా వుంటున్న కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర ఆడ బిడ్డలందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో పారిశ్రామిక ప్రాంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్‌ను కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ బాదే అంజలీదేవి, పట్టణ అధ్యక్షురాలు విజయాచంద్రశేఖర్, ముద్దసాని సంధ్యారెడ్డి, రమ, వసంత, లత, స్వరూప, లావణ్య, రోజా, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

### అబద్ధం కాంగ్రెస్..అభివృద్ధి బీఆర్ఎస్

కోల్‌సిటీ, అక్టోబర్ 19: కాంగ్రెస్ అంటే ఒక అబద్ధం.. బీఆర్ఎస్ అంటే అభివృద్ధి అని, 60 ఏళ్లలో రామగుండంలో జరగని అభివృద్ధి.. కేవలం నాలుగేళ్లలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేసి చూపించారని నగరపాలక 28వ డివిజన్ కార్పొరేటర్ ఇంజపురి పులేందర్ పేర్కొన్నారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. 60 యేండ్లలో అభివృద్ధి చేయడం చేతగాని వాళ్లు ఇప్పుడు ఒక్క సారి అవకాశమిస్తే ఏం చేస్తారో ప్రశ్నించాలన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ అభివృద్ధి కోసం ఆరాట పడే నాయకుడు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండంకు మెడికల్ కాలేజీ ఎలా తెస్తారని ప్రశ్నించిన వారు ఇప్పుడు ఏం చెప్తారో తెలియక ఓట్ల కోసం అసత్యపు ప్రచారాలతో వస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో స్థానికంగా ఉండడం, అయిపోయాక హైదరాబాద్‌కు వెళ్లడం వాళ్లకు పరిపాటేనని విమర్శించారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసం తపించే ఎమ్మెల్యే చందర్‌ను ఈసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ రామగుండంను దత్తత తీసుకుంటానని మాటిచ్చారనీ, ఆ మాటకు కట్టుబడి కారు గుర్తుకు ఓటు వేసి బహుమతిగా ఇద్దామన్నారు. ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'ఖని'లో నృత్య హారతి మహోత్సవం



సాధన చేస్తున్న కూచిపూడి చిన్నారులు

కోల్‌సిటీ, అక్టోబర్ 19: గోదావరిఖని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం ఉజ్వల నృత్యఖని కూచిపూడి అకాడమీ తొలిసారిగా గజ్జె పూజ, నృత్య హారతి మహోత్సవం నిర్వహిస్తున్నది. అకాడమీ నిర్వాహకురాలు,అంతర్జాతీయ కూచిపూడి కళాకారిణి గుమ్మడి ఉజ్వల సారథ్యంలో శాస్త్రీయ, సంప్రదాయ కళ ప్రదర్శన చేపడుతున్నారు. దశాబ్ద కాలంగా కోల్‌బెల్ట్ ప్రాంతంలో శాస్త్రీయ నృత్యకళ రంగానికి జీవం పోస్తున్న కళాకారిణి ఉజ్వల గజ్జె పూజ మహోత్సవం నిర్వహిస్తున్నారు. మంథనికి చెందిన నాట్య గురువు మేదరి నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. గజ్జెపూజ మహోత్సవం అనంతరం జవహర్‌నగర్‌లో గల శ్రీ జయదుర్గ దేవి ఆలయంలో నృత్య హారతి నాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. పారిశ్రామిక ప్రాంత కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గుమ్మడి ఉజ్వల కోరారు.

## కొప్పుల గెలుపొందాలని దుర్గాదేవికి మొక్కులు



ధర్మారం: వస్త్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

ధర్మారం,అక్టోబర్19: ధర్మపురి ఎమ్మెల్యేగా రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ మరోసారి ఘన విజయం సాధించాలని బీఆర్ఎస్ నాయకులు కనకదుర్గా దేవికి మొక్కుకున్నారు. గురువారం పార్టీ యూత్ నాయకులు ఎండీ అజాం బాబా, బొల్లి శేఖర్, ఎండీ అఫ్రోజ్, సాయి ఎర్రగుంటపల్లిలో దుర్గాదేవి మండపంలో అర్చన చేయించి మంత్రి ఈశ్వర్ తరపున దేవతామూర్తికి నూతన వస్త్రాలు సమర్పించారు.

## సాంకేతికతను వినియోగించాలి

వీర్నపల్లి, అక్టోబర్19: వ్యవసాయంలో రైతులు అధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలని కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రాముఖ్యాన్ని కూలంకషంగా వివరించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘం లాభాలను కూడా వివరించారు. రాబోయే యాసంగిలో రైతులందరూ ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలని రైతులకు అధికారులు సూచించారు. ఎరువుల యాజమాన్యం, వివిధ వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సమస్యలకు పరిష్కారాలు చూపారు. ఇక్కడ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ కళాశాల, పాలస విద్యార్థులు, రైతులు హాజరయ్యారు.

## కేంద్రాలను ప్రారంభించాలి

ముస్తాబాద్, అక్టోబర్ 19: వరి కోతలు ప్రారంభమైనందున రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి విన్నవించినట్లు పోతుగల్ సహకార సంఘం అధ్యక్షుడు తన్నీరు బాపురావు, ఎల్లారెడ్డిపేట సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం టెస్కాబ్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి రైతుల పరిస్థితి వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తొందరగా ప్రారంభించాలని కోరారు. సొసైటీకి సంబంధించి కన్స్యూమర్ పెట్రోల్ బంక్‌లను రిటైల్ బంక్ లుగా మార్చడానికి ఎన్‌వోసీ వెంటనే ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

# దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు



గోదావరిఖని టౌన్: దుర్గాదేవికి పూజలు చేస్తున్న గుర్రాల శ్రీధర్

గోదావరిఖని టౌన్, అక్టోబర్ 19, పారిశ్రామిక ప్రజలందరూ బాగుండాలని అంజలీపుత్ర ఎస్టేట్స్ ఉత్తర తెలంగాణ చైర్మన్ గుర్రాల శ్రీధర్ అమ్మవారికి మొక్కుకొన్నారు. గురువారం బస్టాండ్ కాలనీలో నెలకొల్పిన దుర్గా అమ్మవారిని దర్శించుకున్న ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. దుర్గా నవరాత్రుల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి భక్తులకు, కాలనీ వాసులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 40వ డివిజన్ అధ్యక్షుడు చల్లా రవీందర్ రెడ్డి, సమన్వయ కమిటీ ప్రతినిధి ఆకుల సత్యనారయణ, బస్టాండ్ కాలనీ అమ్మవారి కమిటీ శ్రేణులు శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

### ఓసీపీ-1లో చండీ హోమం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 19 : సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1 ప్రాజెక్టు సైట్ ఆఫీస్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మైసమ్మ తల్లి దేవాలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. జీఎం సుధాకర్‌రావు అలివేణి దంపతులు, ఏఎల్‌పీ జీఎం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ ఆశీస్సులతో ప్రాజెక్టులో వార్షిక లక్ష్యం అధిగమించడంతోపాటు కార్మిక కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు జీఎం వెల్లడించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి రాధాకృష్ణ, ఇంజినీర్ ఆర్ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్, పీఎం రవీందర్‌రెడ్డి, రక్షణాధికారి కోటయ్య, డీవైపీఎం సునీల్ ప్రసాద్, సంక్షేమాధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

### జీడీకే-2 గనిపై పూజలు

గోదావరిఖని, అక్టోబర్ 19: సింగరేణి జీడీకే-2వ గనిపై శ్రీ దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం చండీహోమం నిర్వహించారు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏజెంట్లు చిలక శ్రీనివాస్, బానోతు సైదులు, మేనేజర్ నెహ్రూ, తిరుపతి తదితరులున్నారు.



గోదావరిఖని: దుర్గాదేవికి పూజలు చేస్తున్న జీఎం



యైటింక్లయిన్‌కాలనీ: చండీహోమంలో పాల్గొన్న జీఎం

## కంటి ఆపరేషన్లకు తరలింపు



కంటి ఆపరేషన్ల కోసం తరలిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

కోల్‌సిటీ, అక్టోబర్ 19: కంటి సమస్యతో బాధపడే నిరుపేదలకు రామగుండం లయన్స్ క్లబ్ బాధ్యులు ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. గురువారం స్థానిక లయన్స్ క్లబ్ భవన్ వద్ద నుంచి 20 మంది కంటి సమస్య బాధితులను ప్రత్యేక బస్సు ద్వారా కరీంనగర్ రేకుర్తి కంటి దవాఖానకు తీసుకెళ్లారు. క్లబ్ అధ్యక్షురాలు లయన్ తానిపర్తి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి వారంలో రెండు రోజులు లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని గుర్తించి లయన్స్ క్లబ్ తరపున ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ లయన్ కళావతి, కోశాధికారి లయన్ మనీషా అగర్వాల్, తిలక్ చక్రవర్తి తదితరులున్నారు.

## ఒకరి ఆత్మహత్య

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 19: చంద్రబాబుకాలనీలో గురువారం కొరివి రవి(40) అనే హమాలీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య తెలిపిన ప్రకారం.. రవి పదేండ్లుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యాపిల్లలను వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి కొట్టగా భార్య, పిల్లలు బయటకు వెళ్లి వేరేవారి ఇంట్లో తలదాచుకున్నారు. మద్యం మత్తులో రవి రేకులషెడ్డుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేసుకున్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.